# ఆకలి

సుమన్



జ్యోతి

సింహాద్రి నడుం విరిగిన తడికెను తన్నాడు విసురుగా అది వెనక్కి విరుచుకు పడింది. రాజమ్మ నులక మంచం మీదనుంచి లేచి కూర్చుంది.

''కూడు ఏమైనా వుందే'' అడిగాడు సింహాద్రి.

''నేదు'' రాజమ్మ ఠకీమని జవాబిచ్చింది. సింహాద్రికి సహనం చచ్చిపోయింది.

''పొద్దున శేరు నూకల కూడు పొద్దుకూకేలకి మింగేసేవే?''

''ముగ్గురం తినగా యింతుంటే పోరగాడు తిన్నాడు.''

సింహాద్రి ఏమీ అన లేదు. కడుపులో మండుతోంది. పైసా లేదు. కాంట్రాక్టర్ ఎదవ పొద్దోడిసిన కాడ్నుంచి పని చేయించుకొని 'రేపురా' పొమ్మన్నాడు.

''కుండలో ఏమన్నా వుందేమో సూడే'' ఈసారి సింహాద్రి మెత్తగా అన్నాడు.

''నేదు. నేను అబద్ధం ఆడతానా?'' రాజమ్మ ధీమాగా అంది.

సింహాద్రి రాజమ్మ వంక ఓ సారి చూశాడు. తర్వాత మూలగా గోనెసంచి పరచివున్న కుండని తీసి చూశాడు.

రాజమ్మ గుండె ఝల్లుమంది.

''దొంగనంజా నేదన్నావే?''

''పోరగాడికని వుంచాను'' రాజమ్మ గొణిగింది.

''అదిపేరుతో నువ్వు మింగటానికి''

''కాదు ఆడికే.''

సింహాద్రికి కడుపు మంటతో పాటు కోపం మండింది. రాజమ్మ జుట్టు పట్టుకొని వీపు మీద గుద్దాడు. ''సంపేశాడ్రోయ్'' అని రాజమ్మ ఏడుపు మొదలు పెట్టింది.

''ఏడిశావంటే యింకొకటేత్తాను.''

రాజమ్మ నోరు మూసింది.

కుండలో అన్నం పళ్ళెంలో వేసుకున్నాడు సింహాద్రి. రాజమ్మ సింహాద్రి మీదకు దూకినట్లుగా వెళ్ళి పళ్ళెం అందుకొని ''యిది పోరగాడికే నువ్వు తింటానికి నేదు'' అంది గట్టిగా.

సింహాద్రి నిలబడి రాజమ్మ చేతిలో పళ్ళెం లాక్కోబోయాడు. రాజమ్మ పళ్ళెం వీపువెనుక దాచుకుంది.

''యిత్తావా? సంపేయనా'' సింహాద్రి అరిచాడు.

''సంపేయ్-నేను యివ్వను.'' రాజమ్మ దృఢంగా అంది.

సింహాద్రి పళ్ళెం అందుకోబోయాడు. రాజమ్మ అందనీయలేదు. పళ్ళెంతో గుడిసెలో రెండో మూలకు దూకింది. సింహాద్రి రాజమ్మజుట్టు అందుకున్నాడు. రాజమ్మ పళ్ళెంతో వెనక్కి లాక్కుంది. సింహాద్రి ముందుకు గుంజాడు.

రాజమ్మ చేతిలో పళ్ళెం జారి తడిక దగ్గర విరుచుకు పడింది. ఇద్దరి యుద్ధాన్ని ప్రేక్షకుడుగా చూస్తున్న కుక్కపిల్ల అన్నపు

ముద్దమీదకు దూకింది. సింహాద్రి కుక్క మీదకు దూకి బలంగా ఒక్క తన్ను తన్నాడు డొక్కలో. అది గట్టిగా మూల్గి వెనక్కి గెంతింది వెళ్తూ అన్నపుముద్దను నోట కరుచుకుపోయింది.

రాజమ్మ వంక చూశాడు సింహాద్రి. రాజమ్మ కళ్ళల్లో కసి వుంది.

“ఏమే దొంగలంజా—మొగుడుకు పెట్టటంయిష్టంనేద గాని కుక్క కేత్తావటే?” సింహాద్రి మళ్లా జుట్టు అందుకున్నాడు. విసిరి వెనక్కి తోశాడు. రాజమ్మ గోడకు కొట్టుకొని చతికిల పడింది. గుడిసెలో అటు యిటు చూసి ఏడుపు లంకించుకుంది

సింహాద్రికి జాలి కల్గలేదు. లేచి మళ్ళా రాజమ్మ జుట్టు పట్టుకొని మట్టిగోడకేసి కొట్టాడు. రాజమ్మ గోడకు జారగిలబడింది. వక్షంమీద పైట జారిపోయింది. మళ్లా కొట్టటానికి లేచిన సింహాద్రి ఆగిపోయాడు. వక్షోజాలవంక చూశాడు ఎత్తుగా బలంగా వున్నాయి. ఒక్కసారి నరాలు జివ్వుమన్నాయి. గుండెలో వగరపొంగలు కిమ్ముతున్నాయి.

“ఎదవనంజ—యిదొక ఏసం” తిట్టి బయటకు వచ్చాడు విసురుగా, “సిగ్గునేని నంజ” అనుకున్నాడు గొణుక్కొంటూ.

గుడిసెలో కురకలు నురకలుగా వున్న చీకటి బయట చిక్కగా విశాలంగా వుంది.

గుడిసెలన్నీ దాటి మెయిన్‌రోడ్డుమీదకు వచ్చాడు సింహాద్రి. రోడ్డుమీద చీకటిని తరిమి గుడ్డి మునిసిపాలిటీ గుడ్డిదీపాలు కాపలా కాస్తున్నాయి. విసురుగా నడవ సాగాడు సింహాద్రి. రోడ్డు ప్రక్కగా ఎన్నో దుకాణాలు..........మిఠాయిలు పళ్లు, కాఫీ హోటళ్ళు—మనుషులు ఈగల్లా వాటి మీద మూగుతున్నారు.

దాహం వేస్తోంది. ఆకలి ముసురుతోంది కడుపు మెలికలు తిరుగుతోంది. కాళ్ళల్లో నీరసం వచ్చింది ఆగిపోయాడు సింహాద్రి. మేక ఒకటి అరటిగెలవంక చూస్తోంది. ఆశతో కొంచెంసేపు అలాగే చూసి గెల మీదకు దూకి కాయల్ని నోట కరుచుకు పారిపోయింది. కొట్టువాడు వెంటబడ్డాడు.

సింహాద్రి చూస్తున్నాడు. దోమల్లా మూగుతున్న మనుషులు—మేకచూపులు—మేకచూపుల్లో ఆకలి. ‘తను కూడా మేక లాగ పరుగులంకించుకుంటే’? వెంటనే చుట్టూ వున్న మనుషులు గుర్తుకు వచ్చారు సింహాద్రికి. యీళ్లు పట్టుకొంటారు. పోలీసోళ్ళకు పట్టిత్తారు, ఆళ్ళు దొంగనాయాళ్ల సంపేత్తారు.

నెమ్మదిగా అడుగులు వేయసాగాడు. కాళ్ళల్లో నీరసం ఎక్కువైంది. మనుషులు సింహాద్రిని తోసుకొంటూ అడ్డం వచ్చినందుకు బూతులు తిడుతూ పోతున్నారు. సింహాద్రి తూలుతున్నాడు.

* * *

ఎదురుగా రైలుస్టేషను—

జనాల్లోపడి తోసుకొంటు ప్లాట్‌ఫారం మీదకు వచ్చాడు సింహాద్రి.

ఐదు నిమిషాల్లో రైలు వచ్చేస్తుంది. ప్లాట్‌ఫారంమీద మనుషులు పట్టాలవంక చూస్తున్నారు. ఎర్ర తలగుడ్డల టోపీలు బారుగా మోకాళ్ళమీద కూర్చున్నారు. వాళ్ల చూపులు పట్టాలవంకే వున్నాయి.

ఐదు నిమిషాలలో రైలు వచ్చేస్తుంది. ఐదే నిమిషాలు-రైలువస్తే కూలి దొరుకు తాది, ఈ పూట ఆకలి వుండదు.

ఇంకా నరాలు తోడుకూనే వున్నాయి సింహాద్రికి. ఐదు నిమిషాలు చాలు-వచ్చే స్తోంది రైలు-దూరాన ఎక్కడో కెవ్వున అరిచింది. సింహాద్రి నెమ్మదిగా తచ్చాడుతూ తడబడుతూ కూలీల వరుసలో కూర్చు న్నాడు.

వెంటనే సింహాద్రిమీద ప్రక్క కూలీ చూపులు పడ్డాయి వాడు ప్రక్క కూలీతో కళ్ళతో చెప్పాడు. వాడు లేచాడు.

సింహాద్రి దగ్గరగావెళ్ళి అడిగాడు "ఎవడ్రా నువ్వు"

సింహాద్రి బిక్కముఖం వేశాడు.

"లైసెన్సు వుండాలి—ఏది నీకు" అతను మీదకు వస్తూ అన్నాడు.

సింహాద్రి ఏదో చెప్పబోయేంతలో అతను సింహాద్రిని తోశాడు. మిగతకూలీలు వచ్చి కలయబడ్డారు. వాళ్ళు సింహాద్రిని బూతులు తిడుతూ అటు యిటు తోశారు. బయట తుక్కమీద ఊరకుక్కల్లా పడ్డారు తన్నారు. సింహాద్రివెళ్ళి దూరంగా పడ్డాడు. మళ్లా లేచి నిలబడి సర్దుకొనేసరికి కూలీ లందరు మళ్లావరుసలో కూర్చొనివున్నారు. ప్లాట్‌ఫారంమీద వాళ్ళు వినోదం చూస్తు న్నట్లు చూస్తున్నారు.

సింహాద్రి నీరసంగా పట్టాల వంకచూసి మళ్ళా ఎదురుగా చూశాడు.


గుండె ఝల్లుమంది. ఎదురుగా పోలీసు యినస్పెక్టర్. కాకీ గుడ్డల్లో చేతిలో నల్లటి కర్ర.

సింహాద్రి తల దించుకొని భయంగా మళ్లా తలెత్తాడు. యినస్పెక్టర్ తన వంకే చూస్తున్నాడు. ఎందు కట్టా సూత్తాడు? తనేం సేశాడు? టేషనుకి లాక్కెల్తాడా?

పోలీసు యినస్పెక్టర్ మీదనుంచి చూపు మరల్చాడు. అక్కడ ఓ యు వ కు డు. వయసు పాతిక లోపుగా వుంటుంది. ప్రక్కనే వున్న ఆడపిల్ల వంక చూస్తు న్నాడు. ఆడపిల్లకేసే నవ్వుతున్నాడు. ఆడ పిల్ల కూడ నవ్వి ఏమీ తెలియనట్లు తల దించుకొంటూంది. మెలికలు తిరిగి పోతోంది.

"ఎదవనాయాళ్ళు — ఎదవ చదువు— లేచి వచ్చిన పిట్టలేమో" అనుకున్నాడు సింహాద్రి.

యినస్పెక్టర్ గుర్తుకువచ్చాడు. అతను యింకా సింహాద్రివంకే చూ స్తు న్నా డు. "టేషనుకి లాక్కుపోతాడేమో—కేసులు దొరకని రోజున యిట్టాగే సేత్తాడు ఈళ్లు.




రౌడీలకంటే కేడీగాళ్ళు'' సింహాద్రిలోపలే తిట్టాడు.

రైలు వస్తోంది. అరిచింది గట్టిగా రేసు కుక్కలా స్టేషనులో జొరబడింది. క్షణం సేపు కేకలు—గల్లంతు.

''అమ్మో నా పరుసు'' గట్టిగా అరిచారు ఎవరో. సింహాద్రి చూశాడు జనాల్లో నుంచి యువకుడు ఆడపిల్ల వంకచూడటం మాని అరుస్తున్నాడు జేబులు వెతుక్కొంటున్నాడు.

పోలీసు యినస్పెక్టర్....రూళ్ళకర్ర-జైలు—కటకటాలు........

సింహాద్రి పరుగు తీశాడు-మనుషుల్ని తోసుకొంటూ—పడదోస్తూ రోడ్డు మీద పడ్డాడు. వెనుకనుంచి అరుపులు.

''పట్టుకోండి, పట్టుకోండి''

''అయ్యో నా పరుసు''

'రౌడీగాడు''

పోలీసు విజిలు గీపెడ్తోంది.

ఇంకా పరుగెత్తాడు. బలం కొద్దీ పరుగుతీస్తున్నాడు. ఎదురుగా వస్తున్న లారీలు, రిక్షాలు, కార్లు యివేమీ కనబడటంలేదు.

చాల దూరం పరుగెత్తిన తర్వాత ఓ చోట ఆగాడు. ఒళ్ళంతా చెమటలు పట్టింది-

చల్లబడుతోంది. అసలు తినేందుకు పరుగెత్తాడు కేడీ నాయాలులాగ తను దొంగతనం చేయలేదుగా చేయకపోయినా యినస్పెక్టర్ పట్టుకుపోతాడు. తననే చూస్తున్నాడు.

అసలే అకలి-ఆకలి గుర్తుకొచ్చింది సింహాద్రికి.

ఒళ్లు చల్లబడిపోయింది కడుపు యింకా లోపలకు పీక్కుపోయింది. శరీరంలో నీరసం-కాళ్లు లాక్కుపోతున్నాయి గుండె ఎండిపోతోంది

చచ్చిపోతాడేమో! యింకా పది నిమిషాల్లో చచ్చిపోతే? దూసుకుపోతున్నాయి. రిక్షాలు—మనుషులు........

కుక్క కరచుకుపోయిన అన్నం—రాజమ్మ రొమ్ములు-యినస్పెక్టర్ చూపులు కూలీల తిట్లు....ఆకలి.

'ఓ లమ్మో నేను సచ్చిపోతానో''

అరుపు రాలేదు—అది మూల్గు కాదు-గొంతులోనుంచి ఏమీ రాదే? అసలు తను సచ్చాడా? సత్తేరాజమ్మ ముండమోత్తుందా? ఎవడినన్నా తగులుకొంటుందా?

''ఏయ్ ఎవరు నువ్వు?''

సింహాద్రి కళ్ళు తెరిచాడు. ఎదురుగా




అందమైన వ్యక్తి నిలబడి వున్నాడు. నోటిలో సిగరెట్ వెలుగుతోంది. పుల్ సూట్ కేస్ వుంది. సింహాద్రి చటుక్కున లేచి "బాబూ మీ పెట్టె మోసుకొస్తాను. ఓ పావలా యిప్పించండి బాబూ '

'ఎక్కడికి పట్టుకొస్తావ్ యిదే యిల్లు '

తర్వాత ఆ వ్యక్తి సింహాద్రివంక ఎగాదిగా చూసి "లోపలకురా పని చెప్తాను." అన్నాడు సింహాద్రి అతన్నిఅనుసరించాడు. గేటు తోసుకొని లోపలకు వెళ్లాడు. వెనుకే వెళ్ళి వరండా దగ్గరే ఆగిపోయాడు సింహాద్రి. ఆ వ్యక్తి వరండాలో వుండగానే లోపల్నించి ఓ అందమైన యువతి హుషారుగావచ్చి అతన్ని చుట్టివేసి "యిన్ని రోజులకా వచ్చేది — నేను ఎంతగా ఎదురు చూస్తున్నానో తెలుసా?"

రెండు చేతులు అతని భుజంమీద వేసి గట్టిగా హత్తుకొంటూ పెదవులకేసి అందించుతోంది పెదవులు అతను వెనక్కి సంజ్ఞ చేశాడు. ఆమె చటుక్కున చేతులు వదలి దూరంగా జరిగి అటు చూసింది. అక్కడ సింహాద్రి నిలబడివున్నాడు.

"వీ డెవడు?" చీదపురుగుని చూసి నట్లు చూసి అంది.

సింహాద్రి మనసు చివుక్కుమంది.

"నేనే తీసుకువచ్చాను పని వుండి" అతడు జేబులోనుంచి ఓ కాగితంతీసి. ఏదో రాసి డబ్బుతీసి సింహాద్రికి యిస్తున్నాడు" అవతల బజారు షాపులో పట్టుకురా. రాగానే నీకు డబ్బులు యిస్తాను."

సింహాద్రి చీటీడబ్బు అందుకునివెనక్కి తిరిగాడు. వెనుకనుంచి మాటలు వినబడు తున్నాయి.

"ఏమిటి హుషారుగా వున్నావు ఎవరూ లేరా?" అతను అడుగుతున్నాడు.' 'ఆయన క్యాంపుకు వెళ్ళాడు. పనివాళ్ళకు సెలవు" ఆమె హుషారుగానే చెప్పింది.

"అయితే మనిద్దరిదే రాజ్యం అన్న మాట."

కలిసి పకపక నవ్వారు.

సింహాద్రికి వెగటుగా వుంది. "డబ్బు తిరిగి యిచ్చేస్తే?"

ఆకలి-నాల నీరసంగా వుంది. "అళ్ళు ఎటువంటోళ్ళు అయితే నాకేటి? ఈ పని చేస్తే అ బాబు రూపా యివ్వకపోడు."

రోడ్డుమీద చకచక అడుగులు వేయ సాగాడు. కాళ్లు వెంటరావటంలేదు. అయినా వేగంగా యీడ్చుకుపోతున్నాడు. కా సేపుంటే ఈ నీరసం ఆకలి వుండవు.

'అసలు ఈ డబ్బుతో గుడిసెకుపోతే?'

అడికి తను గుర్తా!

"ఒరేయ్ సిమ్మాద్రీ దొంగతనం సేత్తావురా!"

ఛత్ సేయకూడదు.

పది నిమిషాల్లో షాపుముందు ఆగాడు. అద్దాలకేసులో రంగురంగుల సీసా

...బున్నాయి. సింహాద్రి వాటివంక ఆకలిగా చూశాడు.

షాపువాడు యిచ్చిన సీసా తీసుకొని వెనక్కి తిరిగాడు. ఈసారి యింకా వేగంగా నడవసాగాడు. కొన్ని నిమిషాలలో ఈ ఆకలి వుండదు. ముందు పోలెమ్మ కొట్టులో బజ్జీలు నమలాలి. ఏడిగా కరకర లాడ్తాయి.

సింహాద్రి చకచక అడుగులు వేసుకొంటూ గేటు తోసి వరండాలోకి వచ్చాడు. అక్కడ ఎవ్వరూ లేరు. లోపల హాల్లోకి వెళ్ళాడు. అక్కడ ఎవ్వరూ లేరు. పిలిచాడు "బాబు గోరూ" ఎవ్వరూ పలక లేదు. ప్రక్కగదిలో లైటు వెలుగుతోంది. మాటలు వినబడుతున్నాయి. ఆ గొంతులు గుర్తుపట్టి మళ్ళా పిలిచాడు. జవాబు లేదు. తలుపులు తెరుచుకోలేదు.

సింహాద్రి తలుపులు తోశాడు.

నాలుగు పెదవులు విడిపోయాయి. మంచంమీద వెల్లకిలా పడుకున్న యువతి మీదకు రగ్గు లాక్కుంది, అతను సర్దుకొని లేచాడు.

సింహాద్రి నరాలు జివ్వుమన్నాయి. రగ్గు కప్పుకున్నా ప్రక్కనుంచి స్థనాలు కనబడుతున్నాయి తెల్లగా రాజమ్మ యిట్టాగే వుంటుందా? వుండదు. ఈ పిల్ల బాగుంది. యాపిల్ కాయలావుంది.

"బ్రూట్—బుద్ధి లేదురా—గెటౌట్" అరిచాడు అతను. సింహాద్రి తేరుకొని వెనక్కి తిరిగాడు.

"సీసా అక్కడ వుంచి వెళ్ళు."

సీసా నేలమీదవుంచి బయటకు వచ్చాడు సింహాద్రి లోపల తలుపులు గడియపడ్డాయి.

చాలసేపు అక్కడే నిలబడి బయటకు బయల్దేరాడు సింహాద్రి. గొప్పోళ్ళంతా దొంగనాయాళ్ళు—అవును బాబూ తవరు తాగొచ్చు. పావం సేయొచ్చు. కాని గొప్పోళ్ళు. మాలాటోళ్ళు—ఏంసేసినా పాపవే.

ఆ పిల్ల బాగుంది—ఆ బాబు అదృష్టం అసలు మొగుడు ఏంసేత్తాడో—

రోడ్డుమీదకు వచ్చాడు.

కడుపులో ఆకలి అయినా ఏమీ తినాలనిపించటంలేదు, యిపుడు కాళ్ళలో నీరసం వుంది కాని నడవగలడు రోడ్డు మధ్యగా హుంషారుగా వేగంగా నడుస్తున్నాడు.

ముఖాన లారీ వెలుతురు చిమ్మింది కళ్ళకు చేతులు అడ్డంపెట్టి పక్కకు దూకాడు. లారీ అటే దూకింది.

కొన్ని సెకన్లలో అంతా చీకటి—రాక్షసి రొద—హారన్ కీచుగొంతుక—సింహాద్రి అరిచాడు" అయ్యో సచ్చానోయ్"

అది భారతీయ ఆహార సంస్థవాళ్ల లారీ.●

[నట్ హామ్సన్‌కు కృతజ్ఞతతో]